
# విడిచేసిన అసలువిషయం

బుచ్చిబాబు



ప్రొద్దుటే కేపుగాణ్ణి ఉరితీస్తారు. నూపరెంటు చెప్పాడు. తినేటందుకు ఏదో తెచ్చాడు. తలుపుతీసి లోపలికొచ్చాడు కాపలా ఆయన. వెనకాతలే నల్ల కుక్క – తినేటపుడొస్తుంది లోనకి. ముసల్ది. ఒక కన్నంట నుసి కారుతుంది. తోక ఇటుతిరిగి, అటుతిరిగి కాళ్ళకిందికి ముడుసుకుంది. ఎంట్రుకల్లేవు–కాలినై. ఊడినై–తంతే రాలినై. పొట్టకింద ఎజ్జి బెజ్జం–ఈగలు ముసురుతుండై. నోరిప్పి పళ్ళు సూపెడుతుంది. నడుంగా పళ్లు ఊడినై. నోట్లో ఎర్రకంత - నుసి - ముంగటికాలు కుంటి. తలపెద్దదే. కళ్ళల్లోకి అల్లా సూత్తుందేటి? కరవదు. ఎర్రి ముండ. వొచ్చినరోజు బెదిరిపొయ్యాడు, కరుస్తుందేమోనని. మూలకి నక్కాడు కేపుగాడు. లాగు పైకిలాగాడు. రెండు చేతులూ దగ్గరచేర్చి, గుప్పిటగా అదిమిపట్టి మీదికొస్తే పీక పిసకాలని. కాని భయం. మరేటి చెయ్యడం? మీదకొచ్చింది. వాసన చూస్తోంది. కళ్ళల్లోకి చూస్తోంది, నాలుక బైటెట్టి.

కాలివేళ్ళు నాకింది తనూ మూల కెళ్ళి, వాడి రెండు కాళ్ళ నడుమా నిలబడింది. కూర్చున్నాడు కేపుగాడు, పక్కనే పడుకుంది నల్లకుక్క. నాలుక బైపెట్టింది. వాడి కళ్ళల్లోకి చూస్తోంది. దాని మెడచుట్టూ రెండు చేతులూ పోనిచ్చి, గుండ్రంగా మెలితిప్పి, బుజ్జగిస్తున్నాడు. అయ్యోమని మూలిగింది కుక్క-నూతిలో కప్పగెంతినట్లు చేతులు చటుక్కున తీసివేశాడు కేపుగాడు. మళ్ళా మూలగావెళ్ళి కూర్చున్నాడు.

అల్లా ఆ కుక్కతో స్నేహం కలిసింది. తింటున్న పావుగంటా, తనతో వుంటున్న తోటిప్రాణి, మొరగదు, అరవదు. తన చేతులతో దాన్ని బుజ్జగించనూ లేదు.

వాడిచేతులు అట్లాంటివి. విడివిడిగా చేతిని వాడడం వాడికి చేతగాదు. రెండు చేతులూ కాలపాలి. పారపట్టుగున్నా, గునపం పట్టుగున్నా, జనుముకాట పట్టుగున్నా, అగ్గితాడు పట్టుగున్నా వొక చేతితో కాక, రెండు చేతులూ మడిచి పట్టుకోవాలి. రెండు అరచేతులూ కలిపితేనే, పని జరుగుతుంది-వొకచెయ్యి విడిగా ఏమీ చెయ్యలేదు.

పెద్దచేతులు-వెడల్పుగావున్నా, పొడుగాటి వేళ్ళు-కట్లు స్ఫుటంగా, ములక్కాడ కణుపల్లె, బలంగా, గరుకుగా వుంటాయి. చాకులు, కత్తులు పొడుంగానూరి, చెమటతో రంగరించి, అరిచేత చర్మంకింద పూతపూసినట్లు. కనబడని పదునుగల వేళ్ళు. చెర్లోనీళ్ళోసుగునే ముందునీళ్ళల్లో మొహం చూసుగుంటె, మీనకట్టుదర్జాగా కనబడుతుంది. దట్టమైన, ఉంగరాల జుట్టు-మెడవెనక. కొంత చివర తేనెపట్టులా-రెండు చేతులతో, నీళ్ల తీసుగుని, జుట్టులో దుమ్ముని తడిపి - తడిపాక, నీళ్ళల్లో మునిగి తానమాడ్డం. మునిగే ముందు, తుడవడం దేనికి - నా తస్సాదియ్యా!

తినడమైంది-రెండు చేతులతో మట్టిగొట్టం పట్టుగుని నీళ్ల తాగాడు కేపుగాడు మిగిలింది నల్లకుక్కకు పెట్టనవసరంలేదు. అదే కలబడి తింటుంది-నా బైగర్ కరవా! కళ్లల్లోకి సూత్తోంది. ఏడుపుకళ్ళ-శానమ్మ కళ్ల - కూతంత తడి,—మజారే నారాజా! కుక్కనడుంపై రెండు చేతులూ ఆనించబోయి, మానేసి మూలకెళ్ళి, మోకాళ్ళమధ్య మొహం దాచుగున్నాడు.

కుక్క వెళ్ళింది. ఎవడో తలుపు మూసి తాళం వేశాడు. నవ్వొస్తుంది - ఏడుపు మధ్య నవ్వు. మోకాలిమీదలాగు తడిసింది. పొద్దుటిదాకా నవ్వొచ్చు. పొద్దుటే ఉరితీస్తారట. సూపరెంట్ చెప్పాడు-నవ్వుతూ-అదొకలాంటినవ్వు! నంపలేదంటే వినరేంది — పీక పిసికా. అంతే. అదివేరు ముద్దెట్టుకు పీక నులిపా. అంతిష్టం శానమ్మంటె - మెడ నిలిపేతలికి నచ్చింది-ఇష్టంగాచంపాడు-

ఆ నే? తనలో ఇద్దరు-ముద్దెట్టుకునేవోడు, సంపేవోడు. ఇద్దరు యేకమై ఈ పని చేయించారహ.నా సేతికింద రాజ! సేతి పైన రాణి!

శానమ్మ మొగుడు ఇంట్లోంచి పారి పొయ్యాడు అంతా చచ్చారంటారు. ఆడు చావకేం. శానమ్మని వొదిలి చస్తాడూ! మొత్తానికి ఎల్లాడు. అది వొంటిది. పిల్ల-పిల్లేంది-పిల్లలు లేరుకాని, ఉన్నవోరి మాదిరే-పెద్ద.

అందుకే ఆగన్నగాడికి అ ద ం దే మోజు ఆడొకడు తిప్పిగాడు, తల నొప్పిగాడు-తబ్బిబ్బు తుప్పకాడు, సెట్టు నరకలేడు నాయాలు. ఆడికి శానమ్మ కొంగు పరుస్తుందా! సేపలవల ముడిప్ప లేడు నా బొమ్మజెవుడు ముల్లుగాడు, ఆడికి శానమ్మ రవికిప్పుతుందా! శాన మ్మంటె అంతమోజు. గన్నిగాణ్ణి చంపుతానన్నా మీద చెయ్యేస్తే. ఆడూ అన్నాడంట. రెవికిప్పుతే నన్ను సంపే త్తానని. బెదిరింపుకి బెదిరిపొద్ది నణుగుల శానమ్మ అదిప్పేదేంటి అదే వూడి పోతుంది ముడి. ఆవుదూడ మాయకు మల్లే

గన్నిగాడు గెలిచాడు.ఆడు సంపడు. వీళ్ళే సంపుతారు. పొద్దుటే ఉరంట. ఆడికి చాన్స్ లేదులే నా లంగా లచ్చిమీ. శానమ్మ గుచ్చనీ. దానమ్మదేకనీ - ఉరంట - తాడంట - రెండుసేతులూ లేకండా సావంట, నాసామిరాజా!

రెండుసేతులు చానిమెడచుట్టూ ఏసి పైనబడి బుగ్గకరిస్తే నచ్చింది - నేను సంపందే. ఇష్టంగా మెడకొరకమంది. చేతుల్తో కొరికితే, సావడమే, - ఈళ్ళు తాళ్ళతో కొరికి సంపుతారుగా మరి. శానమ్మదగ్గరుండి తమాషాచూస్తే బావుం డును.

అసలు సంపడం గొడవేందహె. కట్టెలు కొడదం సేతులియ్యరా అని పిలిచాడు గన్నిగాడు. గొడ్డలి, గునపం, రంపం కావాలంట. ఆడివల్ల కాదంట. రమ్మని గడ్డం పట్టుగున్నాడు. సంతలో కోడి కొనిస్తానన్నాడు. ఆడి లోపల ఏమారెమ్మ తుమ్మిందో,తాయారుకెరుక. ఆ గునపం నెత్తి నెట్టి రంపంతో నన్ను కోద్దామనా ఆడి వూహ! పిలిసాడు పెద్దోడు, కోడిస్తానన్నాడు. పదహె, అని ఎల్లబొయ్యాను గొడ్డలి బుజాన. రంపం నెత్తిన,తాడు నడుంచుట్టూ తుండు గుడ్డలూ-పోతుండా, - నడిసి, నడిసి,- కరణం పాకవతల మునసబు పొలంసివర —సెట్లు, రుప్ప, దుబ్బు, బొడ్డూడిన నూరుడు ఉయ్యాలలో పడ్డాడు - నల్ల గుంది సుట్టూ-పొద్దోయింది. వందుల పరుగు-తల్లికింద దజను పిల్లలు, తిత్తులు పీకి పీకి, సాకి సాకి, చీకి చీకి-ఛి, ఛి; పిట్టలు ఎగెర్తుండై.

గడ్డివాములో కానింది శానమ్మ.

"ఆడు సంపుతాడు. అటు పోమాక. ఇటురా" అంది. అబద్ధం. తనకి కులుకు-దిలాసా కావాలి. రమ్మంది. గన్నిగాణ్ణి సంపెయ్యాలని చేతులు లావెక్కుతుంటె, దాని మాట వినేతలికి, సైకిలు టైరు పంచరైనట్లు జారుకున్నాయి సేతులు. శానమ్మ కళ్ళు సీకట్లో, గడ్డివాములో రెవికిప్పింది-ఏది వొళ్లు. ఏది కళ్లు. మరె క్కడ నవ్వే పళ్ళు?

నేతికందదు. మూతికి సిక్కనిమొన లేంది. అదంతా రబ్బరు-రబ్బరు ఎనక కడ్డీవొళ్ళు. ముంగలికి రమ్మంది. సేతు లట్టుకుంది. లాక్కుంది.— అట, అట, నడుం దాటేసి, పొట్ట పొడిచేసి. అటెని దూకేసి మెడ సుట్టూ, రెండుచేతులూ బిగించి, బిగించి, గుండ్రంగా, రౌనుగా, రబ్బరు సాగేసి కడ్డీ విరిచేసి, ఓ-అల్లా అల్లా ఇష్టంగా తిప్పేసలికి, ఓ—యమ్మ-శానమ్మ కన్ను మూసింది. తెరవదు — మూతి విప్పదు.

ముక్కంట ఊపిరి తియ్యదు. గుండె ఎగిరివడదు. ఇష్టంగా పీక దువ్వితే, చచ్చింది శానమ్మ. రెండు చేతులు — మోకాళ్ళు తడిసాయి. ఏదో భయం, లాగంతా తడిసింది. భయం, భయం. పైన, కిందా-నీళ్ళు. కన్నీరు. ఆ నీరు భయం, నీళ్ళ మొహం పైకెత్తినవ్వితే, చూసే నల్లకుక్క లేదు; నవ్వే శానమ్మ లేదు; గునపం ఎత్తే గన్నిగాడు లేడు. లేకేం ఆడు బాగానే వున్నాడు. సంత కాడ సంబరం సొంత పిల్ల లంపటం.

పీకలో వుందహె ఊపిరితిత్తు. అది నలపకూడదురా కేపుగా మని షంటె మజారా. మారాజ. రకతం నలిమంటగా సామిరంగ. ఎముకలు నాగళ్లు. నేల దున్ని సారలెయ్యరా - పొలం అవతలనుయ్యి, బావి. బావి దాని బొడ్డు. రెండెద్దులు-ఎద్దుల మోపులు దానివి—ఆ రెండు రబ్బరు బంతులెహె! నేలజోలి నీ కెందుకురా, నీలికాడా. జోలిలేకుంటె కూడెట్ట గొస్తుందిరా! కుందేలు రాజ! కూటికోసం దున్ను - కాటికోసం నడుం విరగదన్ను. తాక మోక. నేలని తాకితివా మట్టి రేగుద్ది. దుమ్ము రేగుద్ది-ఆడమనిషిని తాకితివా, పొంగి పైనలామంటుంది. ఎగిరెగిరి పడతై ఆ రెండూను - సూరుడూ, చంద్రుడూ ఎగిరితే రాత్రి,దిగిరితే ఎండ. వర్షం. బొడ్డుకింద వాన. ములుగెహె! ములిగితేలు. నూతిలో పడిసావు. మరి ఉరేంది.ఆడ కూతురే ఉరి-రాత్రి తాకితే పొద్దుటే ఉరి. చేతులుజోడించిమొక్కరా. నా మామ! దండమెట్టు. దేవుడురా, దేవుడు,— తల్చుకుంటె తడై పోతుంది. తల్సకపోతే తల తిరుగుద్ది. దాని మెడకి దండమెడితే, నీ పీకకి ఉరి. పొద్దుటే. ఛీ, ఛీ,- రకతం తడి, జిగురు, మాయ, వానన మూలుగు, ఏడుపు-లోపల్నించి దాని తాలూకోడు - అదంతా కింద,- దిగువున. బొడ్డుకాడ-కింద. పైకిపో.



పైనపీకి, మెడ రౌనుగా, గుండ్రంగా. అక్కడ ఊగరా, సాగరా, తాగరా, తేనెపట్టు కదపరా కేపుగా. నీకు. నాకు. కొరుకు. నచ్చింది. కిందికెడితే నువ్వు నస్తావు. పైకెడితే అది నస్తుంది. సావు తప్పదురా గురుడ.

* * *

ఆ సాయంత్రం వార్డర్ వెంకటప్ప చూసినప్పుడు అల్లాగే కాళ్ళ నడుమ మొహం దాచుకు కూర్చున్నాడుట కేపు గాడు. రాత్రి తొమ్మిదింటికి రోజూ కంటె కాస్తంత ఎక్కువగా పెట్టారుట తిండి-మంచి పదార్థాలు వొండి, నవ్వు లేదట-ఏడుపూలేదట అల్లా పరధ్యాన్నంగా చూస్తూ, సగం తిని వొదిలే శాడు.

"కుక్క రాలేదేం? అన్నాడుట కేపు గాడు.

"తొంగుంది"

"రోజూ వొచ్చేదిగా."

"నన్నాసిది - ఏమూల చచ్చిందో, నీకు అదంటె భయంగా" అని వెంకటప్ప.

"మొదటిరోజున భయపడ్డా కాని అరవదు. మొరగదు. కరవదు. తిండి టైముకి చేరుతుంది పాపం."

"కు క్క జో లెం దు కు. దేవుణ్ణి తల్చుకో." అని వెంకటప్ప సలహాట.

*　　*　　*

కుక్క మొరిగితే వినాలనుందెహె. శానమ్మ మూలక్కూండ నచ్చిందిగా. ఇంక పైకిరా, పైకిరా - మెడబిగించు,- బాగా-రౌనుగా. అంతిష్టంగా ఏరితో వుండను మామా-ఆ గన్నిగాడు సంబరంరోజు వామికాడికి రమ్మన్నాడు. తప్పన్నా. ఆడంటే భయమా, కేపుగాడంటె? నే లేనుటే-ఆణ్ణి సంపుతా - ఆడు నీ మొగుడుకాడు-ఆడు దొరక్కపోతే నిన్ను సంపుతా - నే చస్తా. ఆడు నిన్ను సంపేలాగుచేస్తా. "అదెట్టా?" ఇష్టంగుంటె కొరికి సంపుతాడు.

ఆడికెట్ట తెలుసు ? అట్టగే జరిగింది.

శానమ్మ, గన్నిగాడు; న్నిగాశమ్మ. గగాన: గామ్మనశా, గమ్మన; గశమ్మగా, నన్నిమ్మిగా, శాగాన్నిన: గశమ్మన్నిన, గానశామ్మ, న్నిమ్మనశాగా, నన్నిమ్మగశా, శాగామ్మనన్ని, గనన్ని శాగా - గాశామ్మనన్నిగ : నన్ని. గశ, శగ, మ్మగన్ని, మ్మ; న; న్ని; నరిగమ; రిగమ నరి, నరీ. శానమ్మ నరీ, గరీ. గరీ. మ్మనశానరా.

ఏళ్ళనడుమ కంత, పొట్టనడుమ కంత, మొహంలో నాలుగు కంతలు, నోట్లో కంత, రాత్రి చందమామకంత, పొగలు సూర్యుడో కంత; ఆకాశంలో చుక్కలన్నీ తెల్లకంతలే. పొలంకాడ బావికంత; సుట్టలో కంతగుండాపొగ; కంతగుండా, హత్తెరీ, బిడ్డ; భళీ, భళీ-ఉరితాడు నడుమకంత - కంతకిముడి-బ్రహ్మముడి. ఊడదు సక్. హక్ - మక్ - అమ్మో చప్పుడు లేదు-సావు-సావను-పీకచుట్టూ కంత, తంక, ంకత, తంక, కంతంకతకతక, ఊరు.ఊరూరు, ఉర్, ఉర్ర్ర్ర్ ఊఉఊ ఊ ఊ ఉఉ రురు, ర్ర్ర ఉరెరెరరె, రూర్, నమ్మశా, శానగన, గన్నిగాశాన, నమ్మిశాగర్ర్, శనర్ర్, నశార గన్నిర్ర్,- ర్ర్ - ఊ, ఊఉ, ంంంం, నిలు, నాయిక, లులినా, కలునా, కనాలు, నాలుకబై బెట్టు, బెట్టుబై బెట్టు, ట్టు,ట్టు ర్ర్, ర్ర్, ఊ, ఊ, ఉ. ఉ. ంంంంంం

ం　　ం　　ం

"ఆ ఉదయం బాగా చలిగావుంది. ఇంక పావుగంట వుందనగా చేరుకుంటాను, రైలు ఆవరణకి : అక్కడకాని, ఉరికి సిద్ధమైన నేరస్థుణ్ణి చూడను. ఆ రోజు, అల్లాకాక, కేపుగాడి గదిముందుగా

నడుచుకుంటూ వెళ్ళాను. ఇంకా అర గంటదాకావుంది వార్డర్‌ని అడగ మన్నాను, వాడికేంకావాలో. వార్డర్ భజనచేస్తున్నట్లు ఏదో పఠిస్తున్నాడు. నేనూ, డాక్టర్ థామస్ అక్కడికి చేరు కున్నాం. కేపుగాణ్ణి ఉరితియ్యడానికి ఇంకా ఇరవై నిమిషాలుంది. తాళ్లు బల్లా లాక్, సరిచూస్తున్నారు. ఆవరణలో సూర్యరశ్మి ఇంకా సోకటంలేదు. చెట్టు కింద నిలబడి టైము చూసుగుంటున్నా. అన్నీసిద్ధంగానేవున్నాయి-తాడు, బల్ల,- లాగేవాడు రెడీ. నిజానికి, ఆ ఉదయం జరగబొయ్యే కాండపట్ల అయిష్టం ఏర్ప డింది నాలో. డాక్టర్‌ని మంచిచేసుకుని ఉరి తియ్యకుండా, కేపుగాణ్ణి మారు వేషంలో ఎక్కడైనా పంపించివేస్తే బాగుండు ననిపించింది. నాకు కేపుగాడు చస్తే, పెద్ద దిగులేంలేదు. అయినా, వాడు చావడం, అవసరంగా తోచటం లేదు. శానమ్మని పీకి పిసికి చంపాడు. అందుకు ఉరిశిక్ష. కాని, వాడు, చంపలేదు పీకి పిసికాను అని చెప్పుతున్నాడు. చంపే వుద్దేశంతో కాదుట. శానమ్మ అంటే అంత ఇష్టంట. ఆ సాయంత్రం గడ్డివా మిలో ఏంజరిగిందో తెలియదు. ఇష్టం ఎక్కువైపోయి, ఆ ఉద్రేకంలో యిష్టంగా గడిపాము అంటాడు. వాడి బండచేతులతో ఆమె కంఠాన్ని నిమురుతూ, ప్రేమచూపుతూ, గట్టిగా అదిమేస్తే, ఆమె చనిపోయింది. ప్రేమతో చంపాడన్నమాట. పగలేదు, క్రోధం లేదు, ద్వేషంలేదు. వాడి చేష్టలు మృత్యువుతో అంతమొందుతాయన్న చైతన్యం వాడిలోలేదు. ఇది హత్యా నేరంగా ఎల్లా భావించను? ఇంగ్లండ్‌లో జూరిలో పెద్దలు బలమైన కారణం వుంటే తప్ప, నేరస్తుడి నేరంపై నిర్ధారణ చెయ్య డానికి సిద్ధపడరు. ఇక్కడ కారణం, కామతృష్ణ, ఆ తృష్ణ చేష్ట, కాండ, వ్యక్తుల సంస్కారంబట్టి వుంటుంది. నాగరీకులు కూడా, ఆ సమయంలో ఉద్రేకానికి లొంగిపోయి, పిచ్చిపన్లు చేస్తారు. పశువులా ప్రవర్తిస్తారు. ఇహ అట్లాంటప్పుడు, చదువు సంస్కారంలేక, అనాగరీకుడైన కేపుగాడు కామోద్రేకానికి విచ్చలవిడిగా లొంగిపోయినప్పుడు పర్యవసానం ఘోరంగా రూపొందవచ్చు. నిగ్రహం నాగరికులకే సాధ్యం అవ నప్పుడు అనాగరికుడికి సాధ్యమవుతుం దనుకోను. అసలు అట్లాంటి అనాగరీక మైన అనుభూతికోసం తహతహలాడు తారు నాగరికులు. వాడూ, మరింత అనాగరీకమైన అనుభూతికోసం, తహ తహ లాడాడు. ఫలితం మృత్యువు.

వాణ్ణి ఉరితియ్యడం సమాజానికి తప్పదా! అది న్యాయమా? అవి న్యాయ మే నన్నారు. మనిషి ప్రాణం అంత విలువైంది. ఆమె అంతటి గొప్ప అను భూతిని ఇవ్వగలిగింది - చంపేటంత తృష్ణని రగల్చగల్గింది. అందుకనే ఆమె

ప్రాణం విలువైంది. దాన్ని ధ్వంసం చేసినవాడికి జీవించే హక్కు లేదు. అరాజకమైన ఆ తృష్ణలో ఇంకెందర్ని చంపుతాడో!


అయినా, కేపుగాడు ఎక్కడో జీవించివుండటమే మంచిదనిపిస్తుంది నాకు. ఇంకా యౌవనం పూర్తిగా వాణ్ణి విడనాడలేదు. ఏదో శక్తి వాడిలోవుంది. కట్టెలే కొడతాడో, కన్యను ఉత్తేజపరిచి మహదానందంతో చంపుతాడో! సృష్టించినవాడికే హతం చేసే హక్కు వుండటం తప్పా? అసలు మరణదండనే ఉండకూడదని నా వాదం. చాల దేశాలలో ఇది తీసివేశారు. మన దేశంలో కూడా దీన్ని తొలిగించడం మంచిది. కేపుగాణ్ణి, స్వయంగా పూనుకుని, డాక్టరుతో లాలోచిఅయి, విడుదలచేసే ధైర్యంలేదు నాకు. డాక్టరు నాతో ఏకీభవించి సహకరిస్తాడనుకోను. కేపుగాడు, మారువేషంలో ఎక్కడికో వెళ్ళిపోయి, తలదాచుకొని, రహస్యంగా బ్రతకగల ఘటం కాడు. ఇక్కణ్ణించి వెళ్ళిన వెంటనే పోలీసు ఠాణాకి వెళ్ళి "నేనే కేపుగాణ్ణి" అని చెప్పివేసే ప్రమాదం లేకపోలేదు. నాకెందుకీ పీడ-చావనీ. ఇంకా ఆరు నిమిషాలుంది. వాణ్ణి అప్పుడే బల్లదగ్గరికి తెచ్చారు. నిక్కరు, ముందు బాగంతడిసి డాగైంది. వీళ్ళందరికీ అంతె. భయంవల్ల కాబోలు. నిలబెట్టారు. వాడి మొహానికి నంచి తొడిగారు. వార్డరు వెనకాల నల్లకుక్క నిలబడింది తోక తిప్పుతూ. వార్డరు వెనక్కి వెళ్లాడు చిటకవేశాడు. కుక్క కదల్లేదు. చెట్ల ఆకులు, ఎండి నా ముందు రాలినై. నేను ఉలిక్కిపడ్డాను. డాక్టరు తన వాచికేసి చూశాడు. ప్రశ్నార్థకంగా నాకేసి చూశాడు. టైమైంది రెండు నిమిషాలు. అంతే, చెట్టునీడలోంచి బల్ల దగ్గర కొచ్చాను. ఉరితాడు వాడి మెడ చుట్టూ అమురుస్తున్నాడు? అంతటా నిశ్శబ్దం, గాలికూడా ఆ క్షణం స్తంభించింది. "ఊ" అన్నాను. "హవ్" మన్న శబ్దం. అంతే అంతా ఐపోయింది. పదిసెకండ్లు.

*　　*　　*

అది,జైలు సూపరిండెంటింట్ సుబ్బన్న చెప్పిన కథ. సుబ్బన్న కన్నడ దేశస్థుడు సూపరింటిండెంట్‌గా పనిచేసి రిటైరయ్యాడు. ఉదయం ఎనిమిదికావస్తోంది. రైలు నిలిచింది. కాఫీ, టిఫిన్లు, పెట్టెలోకి తేవల్సిందిగా ఆర్డరిచ్చాను. ట్రేలో అన్నీ తెచ్చి, అమిర్చాడు. తింటున్నాం. అది ఫస్ట్‌క్లాస్ పెట్టె. ఊడవడానికి ఎవడో వొచ్చాడు. కాసేపు తినడం నిలుపుజేసి కూర్చున్నాం. వాడు ఊడ్చివెళ్లాడు. మళ్ళాతినడం మొదలెట్టాం.

సుబ్బన్న దిగవల్సింది ఆ స్టేషన్ లోనే. సామాన్లు సర్దుకుంటున్నాడు.

"చాలా చిత్రమైన కథండీ" అన్నాను. "ఇంతకీ మీకు అసలు సంగతి




చెప్పనేలేదు." అన్నాడు సూపరింటెండెంట్ సుబ్బన్న. తెల్లమీసంకింద, పుగాకుతో డాగైన పళ్ళపై నవ్వు ప్రదర్శిస్తూ.

"అవును, గన్నిగాడి విషయమూ?" అన్నాను. "వాడికేం, వాడు నిక్షేపంల్లా వున్నాడు. వాడి సాక్షం ఏమిటంటే, వాణ్ణి చంపడానికి గడ్డపార తీసుకుని వొస్తున్నాడుట కేపుగాడు- ఆ విషయం పసిగట్టి, శానమ్మ గడ్డివామి దగ్గరకాని కేపుగాణ్ణి అటకాయించి, ప్రేమకలాపం జరిపిందట. గన్నిగాడిపైవున్న కసి, దానిమీద చూపి చంపేశాడు-అంటాడు గన్నిగాడు. వాడి సాక్షం నిలబడలేదు కోర్టులో. ఎటొచ్చీ హత్యకికారణం దొరికింది. నాకుమాత్రం ఈ కారణం తృప్తికరముగా కనబళ్లేదు. కేపుగాడు చెప్పిన దాన్నే నమ్ముతాను నేను - అక్కడి కొచ్చి కట్టెలు కొట్టడంలో సాయపడవల్సిందిగా కోరాడు గన్నిగాడు. అందుకు వొప్పుకున్నాడు, కేపుగాడు. వీడికి, గన్నిగాడిమీద ఎట్లాటి పగా, కోపమూ వున్నాయనుకోను. అసలు కేపుగాడిలో భయంవుంది కాని, తీవ్రమైన రాగద్వేషాలు లేవనే నే గ్రహించింది. అందుకనే వాడు, శానమ్మ పీక ఎట్లా పిసికి చంపాడా అన్న ఆశ్చర్యం నాకు ఇప్పుడూవుంది. అదొక పొరబాటు, అనుకుంటాను; శానమ్మ చావు ఏక్సిడెంటల్ – కారణాలతో నిమిత్తంలేదు. కేపుగాడి చేతులల్లాంటివి. రెండోది, ప్రారంభ లో వొచ్చే ఆవేశం, ఉద్రేకం వొళ్ళంతా పాకక, వాడి అరిచేతుల్లో కేంద్రీకృతమయ్యే, శారీరిక వ్యవస్థ వాడిది. దానికి మానసిక పరీక్షమందు,

ఏవన్నా వున్నాయో లేదో నాకు తెలియదు.


రైమౌతోంది. నే దిగుతాను. నేచెప్ప వల్సింది ఇదికాదు అన్నాడు, సుబ్బన్న సామాన్లకేసి చూస్తూ. ఈలోగా తలుపు సందులోంచి వొక ఎర్ర కుక్క మా పెట్టెలోకొచ్చి తినుబండారాలకేసి చూస్తూ నిలబడింది. ఇది ఫస్టుక్లాసని దానికి తెలియదు. పాపం సుబ్బన్న దాన్ని వొ తాపు తన్ని బైటకి పంపించాడు. "అదే వినాలి. మరి చెప్పండి—రైలు కదిలితే గొలుసు లాగి నిలుపుచేస్తున్నా మీరు చెప్పింది వింటాను" అన్నాను.

"ఏంలేదు. ప్లాట్‌ఫారం కుక్కలకి టిక్కెట్టే వుండదు. చిత్రం — వెళ్ళింది. నే చెప్పేది కుక్క విషయమే. కేపుగాణ్ణి ఉరితీసినఉదయం,మరోచిత్రం జరిగింది. ఉచ్చు బిగిసి బల్ల లాగెయ్యగానే వాడు కిందికి పడిపోతుండగా, — నల్ల కుక్కలేదూ? - రైలు ఆవరణలో వుండే నల్లకుక్క ఆ కుక్క "మొయ్యో" మని పెద్దగా మొరిగింది. నేను అదిరి పడ్డాను. ప్రశాంతత ఏదో భగ్నమైనట్లు అనిపించింది. అదొక అపశృతి లా తోచింది. హత్యాకాండపై నిరర్ధక వ్యాఖ్యానంలా అనిపించింది. ఏదైతేనేం చాలా చిరాకుపడ్డాను జేబులో పిస్తోలు తీసి, ఆ కుక్కని కాల్చేశాను. ఓవిధంగా నేనూ — హంతకుణ్నే" అని నవ్వుతూ పెట్టెలోంచి బైటకుదిగి, కూలీని పిలిచాను. కూలీ వొచ్చాడు. సూట్‌కేస్, హోల్డాల్ తీసుకున్నాడు. పక్కనున్న సంచీ భుజాన తగల్పడంలో సంచితలుపుకు తగిలి అందులోంచి వొక అట్టపెట్టి కిందపడింది. సుబ్బన్న ఆ పెట్టి తీసి, అందులోంచీ పిస్తోలు లాగాడు,

"ఇది ఉత్తుత్తి పిస్తోల్. మా మనవడికి- ఆడుకునేందుకు."

రైలు కదిలింది సుబ్బన్న ప్లాట్‌ఫారంపై నిలబడి మందహాసం చేస్తున్నాడు.

సుబ్బన్న చెప్పిన సంగతులు ఆధారంగా కేపుగాడు, చివరి ఘడియలు ఎట్లా గడిపిఉంటాడో ఊహించివ్రాసిన భాగాలు కూడా ఇందులో పొందుపరిచాను రేపు ఉదయం ఉరితీస్తారనగా, ఇవాళపగలు, రాత్రి ఎట్లా గడిపాడో వూహించిందన్న మాట. ఆ రోజల్లా వాడి ఆలోచనలు, జ్ఞాపకాలు, ఊహలు ఏమిటో నాకు తెలియదు ఇట్టాంటి ఊహలన్నీ కృత్రిమమైనవే, వాడు చదువు సంస్కారంలేనివాడు. వాడి అనుభవాన్ని బాధనీ, మాటల్లోకిమార్చి, ఇతరులతో పంచుకోగల శక్తి వాడికిలేదు. ఉన్నా కొన్ని గంటల్లో చనిపోతున్నాను, అని తెలుసుకున్నాక ఆ ఊహల స్వరూపం, జీవించి వున్న వారికి తెలుస్తాయనుకోను. మృత్యువు సమక్షాన, మానవుడు ఏమనుకుంటాడో, నాకు తెలియదు. అతని మనస్సు వెనక్కి వెడుతుందా? వెళ్ళి




దేన్ని స్మరిస్తుంది? కష్టాన్నా, సుఖాన్నా,-? అసలు వెనక్కి వెళ్ళక, ముందుకెళ్ళి—తనేమౌతాడో ఊహించుకుంటాడా? గీసిన గిరులను దాటి వెడతాయా? గతం ఎన్ని గిరులు, ఎంత లోతుగా గీసింది? నాకు కేపుగాణ్ని గురించి ఏం తెలుసు? శానమ్మతో గంట గడిపాడు, ఆ సాయంత్రం అంతే. ఇంకేమీ తెలియదు. శానమ్మ చని పోయింది. వాణ్ని ఉరితీశారు. క్షుద్ర జగత్తులో మూడు యదార్థాలని ఉరితాడుగా వేసి, ముడెట్టనా?

కుక్క మొరగగానే, సుబ్బన్న చీకాకు పడ్డాడు. దాన్ని కాల్చేశాడు. అతని మనస్సు కుదుటపడింది. నిజమే కొందరికి అవి కరుస్తాయని భయం. సుబ్బన్నకి కుక్కలంటే రోత. మా రైలు పెట్టెలో కెక్కిన ప్లాట్‌ఫారం కుక్కని తన్ని బైటకి తోసేశాడు. అదుంటే అయనకుతోచదు. అంతే. ఈ రోతకి కారణం తరచిచూస్తే-కీలకం దొరక్క పోదు. అది మృత్యువు. మృత్యువంటే భయం. దాన్ని స్మరింపజేసే ప్రతిదాని పట్లా రోత చూపెడతాడు. మానవుడు. స మా జ ం లో పరిణామాలన్నింటికీ, మానవ వ్యవస్థకీ - డబ్బు,- ఆర్థికస్థితి, కీలకం అయినట్లుగా, మరో ప్రపంచం పునాదులు, మృత్యువుకట్టిన "భయం" పై ఆధారపడతాయేమో.

మరికొందరికి కుక్కంటే యిష్టం. కేపుగాడికి నల్లకుక్క కరుస్తుందని. మొదట్లో బయపడ్డాడు. కాని ఆభయం

పోయాక దానికీ తనకీ పరస్పరం, అన్యోన్యం ఏర్పడింది. చివరి ఘడియల్లో తనకి తోడుగా వున్న ప్రాణి అది వొక్కటే. అది అరవడం, మొరగడం కేపుగాడు ఎరగడు. వాడు బ్రతికి వున్నంతసేపూ మొరగని ఆ నల్ల కుక్క, వాడు చనిపోయి, కళేబరం కిందికి పడిపోతుంటే మొరిగింది, ప్రాణికీ ప్రాణికీ ఉండే బంధం అట్లాంటిదే కాబోలు! అల్లా ఉరితీయబడ్డ వ్యక్తుల్ని ఎందరిని చూసిందో ఆ నల్ల కుక్క. తోటి ప్రాణి వెళ్ళిపోతుంటే తనతో బంధం తెగిపోయినందుకు దుఃఖించి "మొయ్యో" మని మొరిగి తన బాధ ప్రకటించుకుంది. ఒక స్నేహితుడిపట్ల సానుభూతి-మృత్యువు సమక్షాన, జీవి, తను జీవించివున్న సత్యాన్ని ఋజువు చేసుకునే కడసారి చర్య ఆ మొరుగు. కాని సుబన్నకి చీకాకు కలిగించింది. నిండు ప్రాణాన్ని, చట్టరీత్యా తీసే అధికారి. ఈ మొరుగు, అతని చర్యపై నిరసనగా వ్యాఖ్యానంగా తోచి, చిరాకుపడి, కాల్చి, చంపేశాడు. ఆ చర్యతో మృతదగత్తులో ప్రశాంతిని నెలకొల్పుకున్నాడు.

రైలు కదలిపోతూంది. చేతులు ఊపుతూ సుబ్బన్న దూరమైపోతున్నాడు. కాని అసలు విషయం అడగనందుకు, విచారించాను. నన్ను నేను తిట్టుకున్నాను. ముఖ్యమైనదాన్ని విడిచేశాను-మానవుడిపట్ల నాకు నిజమైన కౌతూహలం. దానితో వొచ్చే అనురాగం లేనట్లా? అందరిలాగే నేనూ స్వార్థపరుణ్ణే? కాలక్షేపానికి వినోదానికి కేపుగాడి కథ వింటారా? అంతేనా మనిషి?

సుబ్బన్న ఆ ఉదయం వార్డర్‌తో కేపుగాడికి ఏం కావాలో కనుక్కోమన్నాడు. కనుక్కోమన్నాను, అని చెప్పాడు. అతను చెప్పిన గాథలో చివరి ఘడియల్లో నేరస్థుడి కడసారి కోరిక ఏమిటో అడగడం ఆచారంట. వార్డర్ అడిగాడా, కేపుగాణ్ణి? కేపుగాడు ఏం చెప్పాడు? వాడి చివరి కోరిక ఏమిటి? సుబ్బన్న చెప్పలేదు. సుబ్బన్నకి తెలుసో లేదో నాకు తెలియదు. కాని, ఆ కోరిక ఏమిటో, నే నెందుకు అడగలేదు? సుబ్బన్నకి ఉత్తరం వ్రాసి కనుక్కుందామంటే, సుబ్బన్న అడ్రసు నాకు తెలియదు. నాలో వొక ఖాళీ ఏర్పడింది. నాపై నాకు విశ్వాసం సన్నగిల్లింది? ఏది అప్రస్తుతం? మానవత్వాన్ని మరొకసారి ఋజువుచేసే జ్ఞాపకంపట్ల నాకింతటి అశ్రద్ధా? చివరి కోరిక, "ఆ నల్లకుక్క మొరిగితే వినాలని వుంది" అయి వుంటుందనుకోడంతో సమాధానం కుదుర్చుకుంటాను. మరేం చెయ్యను?